సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం । 1 । ఏప్రిల్ । 2025



రాయచోటిలో గ్యాంగ్ వార్

రాయచోటిలో గ్యాంగ్ వార్ తారస్థాయికి చేరింది. సోమవారం రాత్రి సంజీవనగర్ కాలనీ సమీపంలోని శివాలయం వద్ద ఇరువర్గాల వారు కత్తులు రాళ్లతో దాడులు చేసుకున్నారు. -8లో



భక్తుల కొంగుబంగారం బలిజపల్లె గంగమ్మ

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో విశిష్టత సంతరించుకున్న బలిజపల్లె గంగమ్మ జాతర బుధవారం నుంచి ప్రారంభం కానుంది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.230
రెండోరకం	రూ.120	రూ.180

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 90 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు పదో తరగతి సోషియల్ పరీక్ష

రాయచోటి జగదాంబసెంటర్: ఈ నెల 1వ తేదీన పదో తరగతి పబ్లిక్ సోషియల్ పరీక్ష జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని క్షేత్ర స్థాయిలో ఇప్పటికే ప్రచారం చేశామన్నారు. మంగళవారం జరగబోయే పరీక్ష సజావుగా నిర్వహించడానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సహకరించాలని ఆయన కోరారు.

వైభవంగా పల్లకీ సేవ



పల్లకీలో కొలువుదీరిన స్వామి,అమ్మవారు

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి పల్లకీ సేవ సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవారను అర్చకులు పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుదీర్చారు. ఆలయ మాఢవీధుల్లో ఊరేగించారు. ఈవో డీవీ రమణారెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ తరగతులు

రాయచోటి: ఈనెల 1 నుంచి 2025–26 ఇంటర్ విద్యా సంవత్సరం ప్రారంభం కానున్నట్లు ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కృష్ణయ్య తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మంగళవారం నుంచే క్లాసులు మొదలు కానున్నాయి. మొదటి సంవత్సరం చేరే వారికి 7వ తేదీ నుంచి అడ్మిషన్లు ప్రారభమవుతాయన్నారు. ఈనెల 23 వరకు తరగతులు నిర్వహించి వేసవి సెలవుల ఇవ్వనున్నట్లు తెలిపారు. జూన్ 2న తిరిగి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. అలాగే జూనియర్ కాలేజీల పని వేళలు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని తెలియజేశారు.

విభజన హామీలు అమలు చేయాలి

కడప రూరల్ : ఉమ్మడి రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా జై హింద్ పార్టీ, సమాజ్‌వాది పార్టీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా జై హింద్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.దశరథరామిరెడ్డి మాట్లాడుతూ హామీల అమలులో భాగంగా కడపకు స్టీల్ ప్లాంట్, దుగ్గిరాజుపట్నం ఎయిర్‌పోర్ట్, వైజాగ్–చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్, ఇలా ఎన్నో అంశాలు అమలు కావాల్సి వుందన్నారు. కార్యక్రమంలో సమాజ్‌వాదీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రి రాజ శ్రీనివాసరావు, చంద్రశేఖర్, సీఆర్‌వీ ప్రసాద్, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈద్ ముబారక్

ప్రశాంతమైన వదనాలు.. భక్తులందిరిలోనూ భక్తిభావం.. ఏకేశ్వరుడైన అల్లాహ్ గురించే 'తక్బీర్' చెబుతున్నారు. అల్లాహ్‌పైన గల అచంచల విశ్వాసాన్ని నిరూపించుకునేందుకు తపించారు. మనసునిండా అల్లాహ్ బోధనలే. ప్రతి భక్తునికి మరో భక్తునితో ఆధ్యాత్మికతకమైన బాంధవ్యం పెనవేసుకుంటున్న దృశ్యాలు. మనసును ఉల్లాస పరిచే అత్తరు పరిమళాలు. ఆత్మీయతను పెంచుతూ ఆలింగనాలు. ప్రపంచమంతా శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని,సోదర భావం వెల్లివిరియాలని ముస్లిం మతగురువులు మనసారా ఆకాక్షించారు.

- భక్తిశ్రద్ధలతో ఈదుల్ ఫితర్ ప్రత్యేక ప్రార్థనలు
- సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు



రాయచోటి: సందేశం ఇస్తున్న మతగురువు సర్కాజీ షర్ఫుద్దీన్



రాయచోటి ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనలలో భారీగా పాల్గొన్న ముస్లిం మైనార్టీ సోదరులు

రాయచోటి: నెలరోజులు కఠోర ఉపవాస దీక్షలు, పుణ్యకార్యాలు, ఎదుటివారి ఆకలి బాధలను అర్థం చేసుకునే అవకాశం నేర్పిన రంజాన్ మాసం ముగిసింది. సోమవారం జిల్లా వ్యాప్తంగా ఈదు–ఉల్ ఫితర్‌ను ముస్లిం ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పండుగ సందర్భంగా ముస్లింలకు హిందూ సోదరులు శుభాకాంక్షలు తెలియపరిచారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని ఈద్గాలకు సోమవారం ఉదయమే ముస్లిం సోదరులు చేరుకొని సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువులు సందేశం ఇచ్చారు. జిల్లా కేంద్రమైన రాయచోటిలో మత గురువు సర్కాజి షర్ఫుద్దీన్ ఆధ్వర్యంలో ఈద్‌ఉల్ ఫితర్ నిర్వహించారు.

సామూహిక ప్రార్థనలు: రంజాన్ పండుగ ముగింపు సందర్భంగా నిర్వహించిన సామూహిక ప్రార్థనల్లో జిల్లా రాజకీయ నేతలు పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ముస్లిం మైనార్టీ సోదరులకు ఆలింగనాలు చేసుకొని శుభాకాంక్షలు తెలియపరిచారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి రాయచోటిలోని బండ్లపెంట ఈద్గా మైదానంలో నిర్వహించిన సామూహిక ప్రార్థనలో పాల్గొన్నారు. కోడూరులో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ప్రార్థనల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. రాజంపేటలో బ్రాహ్మణపల్లి, పెద్ద మసీదులలో నిర్వహించిన సామూహిక ప్రార్థనల్లో ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ రెడ్డి ప్రార్థనలు చేశారు.ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మదనపల్లెలోని బెంగళూరు మార్గంలో ఉన్న ఈద్గాలో ఎమ్మెల్యే షాజహాన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నిస్సార్ అహ్మద్‌లు ప్రార్థన చేశారు. పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల పరిధిలో స్థానికంగా ఉన్న నేతలు పాల్గొని మైనార్టీలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పండుగ సందర్భంగా ముస్లిం మైనార్టీ సోదరులు ఇచ్చిన విందు భోజనాలు, తేనేటి విందుల్లో నాయకులు అభిమానులు, హిందూ సోదరులు పాల్గొన్నారు.



మదనపల్లెలోని బెంగుళూరు మార్గంలో ఉన్న ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



రాజంపేట టౌన్: ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

ప్యాసింజర్ రైళ్లు పునఃప్రారంభం

కలికిరి: సుమారు మూడు నెలలు విరామం తర్వాత గుంతకల్లు–తిరుపతి ప్యాసింజర్ రైళ్లు సోమవారం నుంచి గుంతకల్లు – తిరుపతి మార్గంలో తిరిగి ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయం 8 గంటలకు గుంతకల్లులో ప్రారంభమైన తిరుపతి ప్యాసింజర్(57404) రైలు ధర్మవరం, కదిరి మీదుగా కలికిరికి మధ్యాహ్నం 1.10 గటంలకు, తిరుపతికి సాయంత్రం 4.55 గంటలకు చేరుకుంది. మంగళవారం తిరుపతి నుంచి గుంతకల్(57403) ప్యాసింజర్ రైలు ప్రారంభంకానుంది. ఉదయం 6.45 గంటలకు తిరుపతిలో ప్రారంభమై పాకాల మీదుగా కలికిరికి ఉదయం 8.25 గంటలకు, మొలకలచెరువు, కదిరి, ధర్మవరం మీదుగా గుంతకల్‌కు సాయత్రం 3.30 గంటలకు చేరుకోనుంది. అలాగే రాత్రి కదిరిదేవరపల్లి ప్యాసింజర్(57406) కదిరిదేవరపల్లిలో మధ్యాహ్నం 2.45లకు ప్రారంభమై బళ్లారి, గుంతకల్లు, ధర్మవరం, కదిరి, పీలేరు, పాకాల మీదుగా ఉదయం 3.10 గంటలకు తిరిపతికి, తిరుపతి నుంచి రాత్రి కదిరిదేవరపల్లి ప్యాసింజర్(57405) ప్రతి రోజు రాత్రి 11.55 గంటలకు ప్రారంభమై పాకాల, పీలేరు, మొలకలచెరువు, కదిరి, ధర్మవరం, గంతకల్లు, బళ్లారి, రాయదుర్గం మీదుగా మరుసటి రోజు మధ్యాహ్నం 12.10 గంటలకు కదిరిదేవరపల్లికి చేరుకుంటుంది. కదిరిదేవరపల్లి ప్యాసింజర్ రైలుకు గతంలో కలికిరి స్టేషన్‌లో స్టాపింగ్ ఉండగా కోవిడ్ అనంతరం స్టాపింగ్‌ను తొలగించారు. ఇప్పుడు కూడా స్టాపింగ్ ఇవ్వక పోవడంతో స్థానికంగా ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. గత ఏడాది డిసెంబరు 28న ఈ మార్గంలో నడిచే ప్యాసింజర్ రైళ్లను మహాకుంభమేళా నిమిత్తం నిలిపివేశారు. కుంభమేళా అనంతరం తిరిగి ప్రారంభించాల్సి ఉండగా మెయింటెనెన్స్ పేరుతో ఆలస్యంగా మార్చి 31 నుంచి ప్రారంభించారు. ప్యాసింజర్ రైళ్ల ప్రారంభమవ్వడంతో ప్రయాణికుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలి

ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి



వక్ఫ్ సవరణ బోర్డును రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట టౌన్: ముస్లింల మతపరమైన హక్కులను కాలరాసే వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా సోమవారం రాజంపేటలో ముస్లింలు చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఎమ్మెల్యే సంఘీభావం తెలిపి మాట్లాడారు. వక్ఫ్ బిల్లు భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. తమ పార్టీ అధినాయకుడు, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కూడా వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించి రద్దు చేయాలని డిమాండ్ చేశారన్నారు. తాము కూడా జగన్ బాటలో నడిచి రాజంపేటలోని ముస్లింలకు అండగా ఉంటామని, వక్ఫ్ సవరణ బిల్లుకు ముస్లింలు వ్యతిరేకంగా చేపట్టే ఏకార్యక్రమానికైనా తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. పార్లమెంట్‌లో తమ పార్టీకి చెందిన ఎంపీలు సైతం ఇదివరకే ఈ బిల్లును పలుమార్లు వ్యతిరేకించారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలకు నష్టం చేకూర్చే ఈ బిల్లును తీసుకురావడం దుర్మార్గమన్నారు. ముస్లింలకు తాము వెన్నంటే ఉంటామని, వారికి ఏమాత్రం నష్టం కలిగించే చర్యలు చేపట్టినా సహించేది లేదని హెచ్చరించారు. ఈ బిల్లును ప్రవేశ పెడితే వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ముస్లింలు అధైర్యపడవద్దని, కూటమి ప్రభుత్వం పన్నే కుట్రలను వైఎస్సార్ సీపీ తిప్పికొడుతుందని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు ఎస్.జాహీద్ అలీ, ఖాజామోహిద్దీన్, మసూద్, అబ్దుల్ మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

- వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లింలు రంజాన్ సందర్భంగా ఈద్గా, మసీదుల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో చేతికి నల్లబ్యాడ్జీలు ధరించి పాల్గొన్నారు. ప్రార్దనల అనంతరం వక్ఫ్ బచావో దేశ్ బచావో అంటూ నినాదాలు చేశారు.

సీతారాముల కల్యాణానికి పటిష్ట ఏర్పాట్లు

- ఒంటిమిట్టలో 5 నుంచి బ్రహ్మోత్సవాలు
- 11న వైభవంగా కల్యాణోత్సవం
- వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామాలయంలో ఏప్రిల్ 11న జరిగే శ్రీ సీతారాముల కల్యాణానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఒంటిమిట్ట టీటీడీ కల్యాణ మండపం సమీపంలోని పరిపాలన భవన సమావేశ మందిరంలో ఎస్పీ అశోక్ కుమార్, టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, డీఆర్ఓ విశ్వేశ్వరనాయుడుతో కలిసి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు, కల్యాణోత్సవ ఏర్పాట్లపై జిల్లా అధికారులు, టీటీడీ అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ 5 నుంచి ఏప్రిల్ 15 వరకు శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయన్నారు. అందులో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యాలు లేకుండా జిల్లా, టీటీడీ అధికారులు సంయుక్తంగా, సమన్వయంతో పని చేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ముఖ్యంగా ఏప్రిల్ 11న జరిగే సీతారాముల వారి కల్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులతోపాటు ప్రముఖులు రావచ్చనే అంచనాతో అన్ని రకాల ఏర్పాట్లకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

ఎక్కడా జనం తొక్కిసలాట జరగకుండా అధికారులు, పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రసాదం కౌంటర్ల వద్ద ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి ఒక్కరికీ తాగునీరు, అన్న ప్రసాదం కొరత లేకుండా అందేలా చూడాలన్నారు. అలాగే కడప, రాజంపేట వైపు నుంచి ఆర్టీసీ బస్సులు పార్కింగ్, అలాగే ఇతర జిల్లాల నుంచి ఎన్ని బస్సులు వస్తున్నాయో తెలుసుకొని పక్కాగా ప్లాన్ రూపొందించుకొని పార్కింగ్ ఏర్పాట్లు చేసుకోవాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఒకవేళ పార్కింగ్ దూరంగా ఉంటే అక్కడి నుంచి కల్యాణ వేదిక వద్దకు భక్తులను తీసుకువచ్చేందుకు ఉచిత బస్సులను ఏర్పాటు చేయాలని టీటీడీ జేఈఓకు తెలిపారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ టీటీడీ అధికారులు, జిల్లా యంత్రాంగం, పోలీసులు సమష్టిగా కృషి చేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.



టిటిడి జిల్లా యంత్రాంగం అధికారులతో మాట్లాడుతున్న వైఎస్ఆర్ కడప జిల్లా కలెక్టర్

ఆలయ దర్శనం

అంతకు మునుపు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ తితిదే అధికారులు, జిల్లా అధికారులతో కలిసి ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అధికారులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం దేవస్థానం సమీపంలోని శ్రీ కోదండరామస్వామి కల్యాణ వేదికను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కడప, జమ్మలమడుగు, పులివెందుల ఆర్డీఓలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చిన్నయ్య, టీటీడీ డిప్యూటీ ఈఓ నగేష్, ఆర్డీఏ పీడీ ఆనంద్‌నాయక్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా ఫైర్ అధికారి ధర్మారావు, డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, సీపీఓ వెంకటరావు, డీపీఓ, పంచాయతీ రాజ్ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ రమణయ్య, డీటీసీ, ఆర్టీసీ అధికారులు, టీటీడీ , ఈఓపీఆర్, పీఆర్ఓలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కష్టాలు

- మండుటెండలో కూలీల అవస్థలు
- పని చేస్తున్న చోట నిబంధనలు గాలికి వదిలేశారు
- దాహం తీర్చే నీళ్లు కరువు
- ప్రమాదం జరిగితే మెడికల్ కిట్లు లేవు

బి.కొత్తకోట: మండుటెండలో ఉపాధి కూలీ పనులు చేస్తున్న వారికి వర్తించాల్సిన కనీస సౌకర్యాలను ప్రభుత్వ కల్పించలేకపోతోంది. ప్రస్తుతం సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు. పనులు చేస్తేకాని పూట గడవని కూలీలు ఇప్పుడు ఎండలో మాడిపోతున్నారు.వీరి దయనీయ స్థితిపై ప్రభుత్వం కానీ, అధికారులు కానీ స్పందించకపోవడం విచారకరం. కూలీలు పనిచేస్తున్నది ఉదయం వేళల్లో అయినప్పటికి ఎండలు అసాధారణంగా ఉంటున్నాయి. ఏప్రిల్‌లో ఏ స్థాయిలో ఉంటాయో చెప్పాల్సిన పనిలేదు. జిల్లాలోని 30 మండలాల్లో డ్వామా ద్వారా ఉపాధి హామీ పథకం పనులు జరుగుతున్నాయి.

డిమాండ్ మేరకు రాని కూలీలు

జిల్లాలో ఎండలు ముదరడంతో ఉపాధి పనులు చేసేందుకు వచ్చే కూలీల సంఖ్యపై ప్రభావం చూపుతోంది. ఉదాహరణకు శనివారం (మార్చి 28) జిల్లాలో ఉపాధి పనులు చేసేందుకు 23,223 మంది కూలీలు హాజరవుతారని నిర్ణయించి అందుకు తగ్గట్టుగా పనులు సిద్ధం చేశారు. అయితే 21,120 మంది హాజరవగా 2,103 మంది పనులకు రాలేదు. హాజరైన వారిలో అత్యధికంగా రామాపురంలో 1,292 మంది పెనగలూరు మండలంలో 1,286 మంది, లక్కిరెడ్డిపల్లి మండలంలో 1,151 మంది, పుల్లంపేట మండలంలో 1,057 మంది కూలీలు పనులు చేశారు. ఎండల ప్రభావానికి కూలీల శాతం తగ్గినట్టు స్పష్టంగా తెలుస్తోంది.

ఆస్పత్రుల్లో అడిగి తెచ్చుకోవాలట..

కూలీల కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్న విషయమై ఉపాధి అధికారులు చెబుతున్నది వింటే అయ్యో అనిపిస్తుంది. తమకు పైనుంచి ప్యాకెట్లు పెట్టాలని కాని, సరఫరా చేస్తున్నట్టుగా ఆదేశాలు లేవని అంటున్నారు. అయితే కూలీలపై దయతలచి మండలాల్లోని ఏపీఓలు స్థానిక ప్రభుత్వాసుప్రతులకు వెళ్లి డాక్టర్లతో మాట్లాడి ఓఆర్ఎస్ ప్యాకెట్లను తెచ్చుకోవాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారని అంటున్నారు. అంటే వైద్యులు దయతలచి ఇస్తే సరే..ఒకవేళ ఆస్పత్రులకే ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరిపోకపోతే ఇచ్చేదెవరు అన్నది ప్రశ్నార్థకం. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పటివరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూలీలు పనిచేస్తున్న చోట కనిపించలేదు.



బి.కొత్తకోట మండలం బడికాయలపల్లెలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు కనుచూపుమేరలో కనిపించని సౌకర్యాలు

నీరు, నీడ ఎక్కడ..



ఉపాధి కూలీలకు చట్ట నిబంధనల ప్రకారం సౌకర్యాలను కల్పించాల్సి ఉంటుంది. ఎండల తీవ్రత దృష్ట్యా పనిచేస్తున్న చోటనే నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి. వడదెబ్బకు గురికాకుండా చూసుకోవాలి. ఎండ అధికమైనప్పుడు సేద తీరేందుకు పని చేస్తున్న చోట నీడ కల్పించాలి. పనుల సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే తక్షణమే వైద్యం అందించేలా మెడికిల్ కిట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఈ సౌకర్యాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. ఎండల్లోనే కూలీలు పనులు చేస్తున్నారు. దాహం తీర్చుకునేందుకు నీరు లేదు, సేద తీరేందుకు నీడ లేదు. అస్వస్థతకు గురైతే కూలీలకు తక్షణ ఉపశమనం కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలి. ఇది చాలా ముఖ్యమైన విషయం. ఒకవేళ వడదెబ్బకు గురైతే ఆ కూలీ కోలుకోవడానికి తీవ్రంగా వ్యయ ప్రయాసలకు ఓర్చుకోవాల్సి ఉంటుంది. ఈ సౌకర్యాలు కల్పించనప్పటికి కూలీలు అష్టకష్టాలు పడుతూనే ఉపాధి పనులు చేస్తున్నారు.

మార్చి 29న పనిచేసిన కూలీల వివరాలు

మండలం	హాజరైన కూలీలు
బి.కొత్తకోట	842
చిన్నమండెం	678
చిట్వేలి	816
గాలివీడు	448
గుర్రంకొండ	911
కలకడ	521
కలికిరి	761
కేవీపల్లె	353
కోడూరు	948
కురబలకోట	679
లక్కిరెడ్డిపల్లె	1,151
మదన పల్లె	510
ములకలచెరువు	571
నందలూరు	262
నిమ్మనపల్లె	552
ఓబులవారిపల్లె	992
పెద్దమండ్యం	651
పీటీ సముద్రం	639
పెనగలూరు	1,286
పీలేరు	616
పుల్లంపేట	1,057
రాజంపేట	674
రామాపురం	1,292
రామసముద్రం	750
రాయచోటి	296
సంబేపల్లె	560
టిసుండుపల్లె	319
తంబళ్లపల్లె	70
వాయల్పాడు	989
వీరబల్లి	926

ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు స్లాట్ బుకింగ్

4 నుంచి స్లాట్ బుకింగ్ విధానం

కడపకోటిరెడ్డిసర్కిల్: రిజిస్ట్రేషన్‌శాఖలో క్రయ, విక్రయాలకు స్లాట్ సదుపాయం అందుబాటు లోకి రానుంది. కక్షిదారులకు సులభతర, వేగవంతమైన సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ సదుపాయాన్ని కల్పిస్తోంది. జిల్లాలో తొలుత కడప ఆర్ఓ కార్యాలయంలో అమలు కానుంది. పనిదినాల్లో ఉదయం 10–30 గంటల నుంచి సాయంత్రం 5–30 మధ్యలో స్లాట్‌ను బుక్ చేసుకోవచ్చు. ఈ విధానం వల్ల రోజంతా నిరీక్షించే పనితప్పుతుంది. స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికి నిర్ణీత సమయంలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాల్సి వుంటుంది. ప్రజలకు ఎలాంటి అసౌక ర్యం లేకుండా రిజిస్ట్రేషన్ సులభతరంగా పూర్తవుతుంది. ఈ విధానం విజయవంతం అయితే రాబోవు రోజుల్లో అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రవేశ పెట్టేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. కాగా కడప ఆర్ఓ కార్యాలయంలో ఏప్రిల్ 4 నుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. ఈ సందర్భంగా జిల్లా రిజిస్ట్రార్ పీవీఎన్ బాబు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్లను సులభతరం చేసి వేగవంతంగా పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం స్లాట్‌బుకింగ్ విధానం అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ విధానాన్ని అన్ని కార్యాలయాల్లో ప్రవేశపెట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే సమయం వృథా కాదని తెలిపారు. మొదట ప్రతి జిల్లా కేంద్రంలోని ఆర్ఓ కార్యాలయాల్లో అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సరికొత్త విధానంపై స్థిరాస్తి, వ్యాపారులు, దస్తావేజు లేఖర్లు ఆన్‌లైన్ సంస్థల ప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు రిజిస్ట్రేషన్‌శాఖ సన్నద్ధమవుతోంది.

క్లుప్తంగా

బస్సు ఢీకొని యువకుడికి గాయాలు



అసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రదీప్‌కుమార్‌రెడ్డి

సిద్దవటం: బస్సు ఢీకొని యువకుడు గాయపడ్డారు. మండలంలోని సంటిగారిపల్లె గ్రామానికి చెందిన ప్రదీప్‌కుమార్‌రెడ్డి సేల్స్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం కూడా సిద్దవటం నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా.. కడప నుంచి బద్వేల్ వైపునకు వెళ్తున్న ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొంది. ప్రదీప్‌కు తీవ్ర గాయాలవడంతో కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. ప్రదీప్‌కుమార్‌రెడ్డి తండ్రి రామక్రిష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సుబ్బరామచంద్ర తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతి చెందిన జయరామ్

మదనపల్లె : ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు వన్ టౌన్ సీఐ ఎరిషావలి తెలిపారు. గత మార్చి 22న గుర్తుతెలియని వ్యక్తి పట్టణంలోని బెంగళూరు బస్టాండులో మద్యం తాగి అపస్మారస్థితిలో పడిపోయారు. స్థానికులు 108 అంబులన్స్ వాహనంలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. ఆస్పత్రిలో చికిత్స అనంతరం స్వల్పంగా కోలుకున్న అతడు తన పేరు జయరాం(55)గా పేర్కొన్నారు. ఇతర వివరాలు ఏమీ తెలపలేని స్థితిలో ఉండగా, పరిస్థితి విషమించి 31న తిరుపతి రూయా ఆస్పత్రిలో మృతిచెందాడు. అతని సంబంధీకులు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.

భక్తుల కొంగుబంగారం బలిజపల్లె గంగమ్మ

- రేపు రాత్రి నుంచి జాతర ప్రారంభం
- జాతరకు రెండు వందల ఏళ్లకు పైగా చరిత్ర

రాజంపేట టౌన్ : రాజంపేట మున్సిపాలిటీ పరిధిలోని బలిజపల్లెలో స్వయంభువుగా వెలసిన గంగమ్మ ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఎంతో విశిష్టత సంతరించుకుంది. రెండు వందల ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ జాతరకు ఏటా లక్ష మందికిపైగా భక్తులు హాజరై అమ్మవారికి ఇష్టమైన నైవేద్యాలు సమర్పిస్తారు. అమ్మవారికి వరపడితే తమ కష్టాలు తొలగిపోతాయని, కోరిన కోర్కెలు గంగమ్మ నెరవేరుస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందుకే బలిజపల్లె గంగమ్మ భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతుంది. బుధవారం రాత్రి నుంచి జాతర ప్రారంభం కానుంది.

సంప్రదాయాల సమ్మేళనం

బలిజపల్లె గంగమ్మ జాతర అనేక సంప్రదాయాల సమ్మేళనం. బలిజపల్లె, తుమ్మల అగ్రహారం, నారపురెడ్డిపల్లె గ్రామ ప్రజలు కలిసి అమ్మవారి జాతర నిర్వహిస్తారు. తొలుత బలిజపల్లె వాసులు తేదీ నిర్ణయించి అనంతరం తుమ్మల అగ్రహారం, నారపురెడ్డిపల్లె నిర్వాహకులతో చర్చిస్తారు. అంగీకారం రాగానే జాతర తేదీ ఖరారు చేశారు. ఆదివారం జాతరకు అంకురార్పణ చేసి గురువారం జాతర నిర్వహించనున్నారు. ఆయా గ్రామాల ప్రజలు అమ్మవారికి వివిధ రకాల సాంగ్యాలతో జాతర ఘనంగా నిర్వహిస్తారు.



భక్తులకు దర్శనమిచ్చే అమ్మవారి రూపం (ఫైల్)

బలిజపల్లెలో అమ్మవారి ప్రతిమ

జాతరలో కొలువుదీరే గంగమ్మ ప్రతిమను బలిజపల్లెలోని ఓ వేపచెట్టు కింద దాదాపు ఆరు గంటల పాటు కష్టపడి తయారుచేస్తారు. అనంతరం ప్రతిమను నిర్వాహకులు పూల రథంపై ఊరేగిస్తారు. వేపమండలతో తయారు చేసిన గుండిలో తీసుకొచ్చి కొలువుదీర్చుతారు. అమ్మవారు గుడిలోకి వచ్చే సమయంలో భక్తులు పెద్దఎత్తున నైవేద్యాలు ఎదురుగుంభంగా ఇచ్చేందుకు పోటీపడతారు. యాభై అడుగుల దూరంలో ఉండే గుడిలోకి అమ్మవారిని తీసుకురావడానికి దాదాపు రెండు గంటల సమయం పడుతుంది. బలిజపల్లె నిర్వాహకులు విశేషంగా పూజలు నిర్వహించి సాంగ్యాలు సమర్పిస్తారు. అమ్మవారు కొలువుదీరగానే జాతర ఊపందుకుంటుంది.

తుమ్మల అగ్రహారం నుంచి గండదీయలు

బలిజపల్లెలో కొలువైన గంగమ్మకు తుమ్మలఅగ్రహారం పుట్టినిల్లు అని పెద్దలు చెబుతారు. దీంతో గ్రామ మహిళలు బుధవారం రాత్రి బలిజపల్లె గ్రామానికి గండదీయలను తీసుకెళ్తారు. గురువారం వేకువ జామున గుడిలో కొలువుదీరాక మహిళలు తీసుకొచ్చిన గండదీయలను చెల్లిస్తారు. ఈ సమయంలో గంగమ్మను దర్శించుకునేందుకు వేలాది మంది బారులు తీరుతారు. అగ్రహారం మహిళలకు ప్రత్యేకమైన గౌరవం ఇచ్చి చెల్లించే ఏర్పాట్లుచేస్తారు.

నారపురెడ్డిపల్లె నుంచి నవధాన్యాలు

జాతర సందర్భంగా గంగమ్మ తల్లికి నారపురెడ్డిపల్లెకు చెందిన జాతర నిర్వాహకులు, ప్రజలు బుధవారం రాత్రి నవ ధాన్యాలు తీసుకొస్తారు. గంగమ్మ సోదరుడైన పోతు రాజును తప్పెట్లతో ఉత్సాహంగా బలిజపల్లెకు తీసుకొస్తారు. పోతురాజు ఊరేగుతూ వచ్చే సమయంలో భక్తులు కర్రసాము, ఐదడుగుల వ్యక్తులు నృత్యాలు చేస్తూ కోలాహలంగా బలిజపల్లెకు చేరుకుంటారు.

ఇది మా పూర్వజన్మ సుకృతం

బలిజపల్లె గంగమ్మ తల్లి సత్యమైన దేవత. గంగమ్మను పూజించి ఏకార్యం చేపట్టినా నెరవేరుతుంది. అందువల్ల మా ఊళ్లో వాళ్లే గాక ఎక్కడెక్కడి వాళ్ళో వచ్చి అమ్మవారిని పూజించి తమ కార్యాలు ప్రారంభిస్తారు. బలిజపల్లె గ్రామంలో మేము జన్మించడం మా పూర్వ జన్మ సుకృతం.



\- కోనిశెట్టి వెంకటయ్య, బలిజపల్లె, రాజంపేట

ఊరంతా సందడి

వేర్వేరు చదివే పిల్లలు, ఉద్యోగాలు చేసే వారంతా బలిజపల్లె గంగమ్మ జాతరకు ఇంటికి వస్తారు. ఊరంతా ఆ రోజుల్లో సందడిగా ఉంటుంది. అందరి ఇళ్లు బంధువులతో కళకళలాడుతాయి. వచ్చిన వారంతా బంధువుగా నన్ను పలకరించడంతో మనసు పులకరించిపోతుంది. జాతరలో మా ఊరికి భాగస్వామ్యం ఉండటం అదృష్టం.



\- అనంతరాజుగారి గంగమ్మ, తుమ్మల అగ్రహారం, రాజంపేట మండలం

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ఖాజీపేట : జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు సి.చక్రవర్తి(29) సోమవారం మృతిచెందాడు. ఖాజీపేట పంచాయతీ బుడ్డాయపల్లె గ్రామానికి చెందిన చక్రవర్తి(చక్రీ) ఆదివారం రాత్రి ఖాజీపేట నుంచి బుడ్డాయపల్లెకు బయలుదేరాడు. హైవే క్రాస్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీ కొంది. తీవ్రగాయాలైన చక్రవర్తిని స్థానికులు కడప రిమ్స్‌కు తరలించారు. అప్పటికే అతను మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. చక్రవర్తి భార్య ఫిర్యాదు మేరకు.. ఖాజీపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బంధువుల నిరసన

చక్రవర్తి హైయ్యర్ బస్సుల్లో డ్రైవర్‌గా వెళ్తున్నారు. తోటి డ్రైవర్ మృతి చెందిన విషయం తెలుసుకుని మృతుడి బంధువులు, డ్రైవర్లు ప్రొద్దుటూరు హైయ్యర్ వాహనాల యజమాని వద్ద నిరసన తెలిపారు.

ఇరు వర్గాల ఘర్షణ

కొండాపురం: మండలంలోని బెడుదూరు గ్రామంలో ఇరువర్గాల ఘర్షణలో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ హృషికేశవరెడ్డి తెలిపారు. పోలీసుల వివరాలమేరకు.. ఇరు వర్గాల వారు పిల్లలు కొట్లాడుకున్నారంటూ గొడవపడ్డారు. ఓ వర్గానికి చెందిన ఆవుల ప్రసాద్‌పై మరో వర్గం దాడి చేసింది. ప్రసాద్‌ను ఆసుపత్రికి తరలించారు.

ఉద్యోగుల సేవలు మరువలేనివి

రాయచోటి అర్బన్ : వైద్య, ఆరోగ్య శాఖలో ఉద్యోగుల సేవలు మరువలేనివని అడిషనల్ డీఎంఅండ్ హెచ్ఓ శైలజ, ఆర్ఐఓ ఉషశ్రీ అన్నారు. రాయచోటిలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా పనిచేసి పదవీ విరమణ చేసిన డాక్టర్ కొండయ్యకు స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయంలో సోమవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండయ్య విధులను అంకితభావంతో నిర్వర్తించడంతోపాటు ఉద్యోగుల పట్ల సానుకూలతతో వ్యవహరించారన్నారు. క్రమశిక్షణ, నిజాయితీకి మారు పేరుగా నిలిచారన్నారు. డాక్టర్ కొండయ్య మాట్లాడుతూ ఉద్యోగులంతా నిబద్ధతతో పనిచేసి తగు గుర్తింపు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో రియాజ్‌బేగ్, విష్ణువర్ధన్‌రెడ్డి, దేవశిరోమణి, ఓబుళరెడ్డి, రవికుమార్, మునీవర్, ప్రసాద్, ప్రసాద్ యాదవ్, వెంక టేశ్వర రెడ్డి, దేవేంద్ర, బలరాం, మహాదేవ, వేణుగోపాల్‌రెడ్డి, శివారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కొండయ్య దంపతులను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

నిప్పు రాజుకుని మామిడిచెట్లు దగ్ధం

సుండుపల్లె : మండలంలోని మాచిరెడ్డిగారిపల్లె పంచాయతీ కటారు ముడుకు సమీపంలోని అటవీ ప్రాంతం (లైను)లో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం నిప్పు పెట్టారు. దీంతో మంటలు వ్యాపించి తలెత్తిన ప్రమాదంలో మిట్టబిడికి చెందిన మూడే లక్ష్మమ్మ, మరింత మంది మామిడిచెట్లు, కంచె, బోరు పైపులు, స్టార్టర్లు దగ్ధమయ్యాయి. 50కి పైగా మామిడి చెట్లు దహనమైనట్లు బాధితులు తెలిపారు.



కాలిపోయిన చెట్లు

మట్టి తరలింపునకు అడ్డుకట్ట

రాజంపేట: మండలంలోని ఎర్రబల్లి కొండ ప్రాంతంలో మట్టి తరలింపునకు గ్రామస్తులు సోమవారం అడ్డుకట్ట వేశారు. రాజంపేట మున్సిపాల్టీ ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణాల కోసం స్థలం కేటాయించారు. కొందరు జేసీబీలు పెట్టి అక్కడ మట్టి తవ్వుతుండడంతో గ్రామస్తులు తవ్వకాలకు ఎవరు అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. ట్రాక్టర్లను అడ్డుకున్నారు. వైఎస్సార్‌సీపీ రూరల్ మండల అధ్యక్షుడు దొడ్డిపల్లి భాస్కర్‌రాజు రాజంపేట మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించారు. అక్రమ తరలింపునకు అనుమతి ఇవ్వవద్దని ఆయన సూచించారు.



ట్రాక్టర్లలో మట్టిని తరలిస్తున్న యువకులు

రైలు పట్టాలపై మృతదేహం

రాజంపేట : నందలూరు–రేణిగుంట రైలు మార్గంలో హస్తవరం రైల్వే స్టేషన్ వద్ద సోమవారం 25 ఏళ్ల వయస్సు కలిగిన యువకుడి మృతదేహం స్థానికులు గుర్తించారు. రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వివరాలు తెలియాల్సి ఉంది.



రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం

రైతు ఆత్మహత్య

పుల్లంపేట : వ్యవసాయంలో నష్టాలు వచ్చి అప్పుల పాలైన రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం తిప్పాయిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. తిప్పాయిపల్లి హరిజనవాడకు చెందిన దార్ల రఘురామయ్య (52)కు ప్రభుత్వం ఐదు ఎకరాలు భూమిని మంజూరు చేసింది. అరటి తోటన సాగు చేసి జీవనం కొనసాగిస్తున్నాడు. వాతావరణం అనుకూలించగా, ఆశించిన దిగుబడి రాకపోవడంతో అప్పులు పెరుగుతూ వచ్చాయి. దీంతో రూ.7లక్షలు అప్పుచేసి తీర్చలేక మనస్థాపం చెందారు. ఆదివారం విష ద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అపస్మారక స్థితిలోకి చేరి సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య వరలక్ష్మీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రఘురామయ్య (ఫైల్)

అక్కానగర్‌లో కత్తిపోట్ల కలకలం



తీవ్రంగా గాయపడిన సొహెయిల్‌కు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

కమలాపురం : స్థానిక అక్కా నగర్‌లో ఆదివారం రాత్రి ఇరు వర్గాల యువకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు కత్తి పోట్లకు గురయ్యారు. స్థానికులు, బాధితుల సమాచారం మేరకు.. అక్కా నగర్‌లో గతంలో నివాసమున్న సల్మాన్ ఇటీవల ఇందిరమ్మ కాలనీలో చేరారు. పది రోజుల కిందట అక్కానగర్‌కు వచ్చి బైక్‌ను ఎక్కువ స్పీడ్‌తో రైడ్ చేస్తున్నారు. అదే కాలనీకి చెందిన సొహెయిల్, షాబాజ్ స్పీడ్‌తో వెళ్ల వద్దంటూ మందలించారు. అది మనసులో పెట్టుకున్న సల్మాన్ ఆదివారం రాత్రి అక్కానగర్‌కు వచ్చి సోహెల్, షాబాజ్‌లను కత్తితో పొడిచాడు. అడ్డు వచ్చిన రియాజ్‌పైనా దాడికి దిగాడు. స్థానికులు గుర్తించి వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సొహెయిల్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు. షాబాజ్, రియాజ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఆసుపత్రికి వచ్చి జరిగిన దాడి గురించి ఆరా తీశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దాడికి పాల్పడిన సల్మాన్ పరారీలో ఉన్నాడు.

ఒంటిమిట్ట పోలీస్ స్టేషన్ తనిఖీ

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఈజీ.అశోక్‌కుమార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉమెన్స్ హెల్ప్ డెస్క్‌పై సిబ్బందికి సూచనలు చేశారు. మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం స్టేషన్ పరిసరాలు పరిశీలించి స్టేషన్ ఆవరణంతా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పెండింగ్ కేసులు త్వరగా విచారించి పరిష్కరించాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, కోదండరాముడి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేయాలని ఆయన ఆదేశించారు. ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, చోరీలు, నేరాలు జరగకుండా పగలు, రాత్రి గస్తీ ముమ్మరం చేయాలని సూచించారు. ప్రజా వేదికకు వచ్చే ఫిర్యాదులపై సత్వరమే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. వృత్తిపరమైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని, పాత నేరస్తులు, సస్పెక్ట్ కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఒంటిమిట్ట సీఐ బాబు, ఎస్ఐ శివప్రసాద్, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.



పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న కడప జిల్లా ఎస్పీ

ట్రాక్టర్ ఢీకొని.. ఒకరు మృతి

మదనపల్లె : ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన సోమవారం ములకలచెరువు మండలంలో జరిగింది. మదనపల్లె పట్టణం అమ్మచెరువుమిట్టకు చెందిన శ్రీరాములు కుమారుడు శంకర(42)టెంపో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నారు. అతడికి భార్య శాంత, పిల్లలు ఉన్నారు. సోమవారం ములకలచెరువు మండలంలోని తన భార్య స్వగ్రామంలో జాతర జరుగుతుండంతో ద్విచక్ర వాహనంలో మదనపల్లె నుంచి బయలుదేరాడు. బురకాయలకోట వద్ద ట్రాక్టర్ ఢీకొనడంతో గాయపడి అపస్మారక స్థితికి వెళ్లాడు. స్థానికులు 108 అంబులెన్స్‌లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ములకలచెరువు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.



ట్రాక్టర్ ఢీకొని మృతి చెందిన శంకర

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

సంబేపల్లె/రాయచోటి టౌన్/చిన్నమండెం : ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఎదుట ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నారాయణరెడ్డిపల్లె, కొండవాండ్లపల్లె, చిన్నమండెం మండలంలోని చిన్నమండెం టౌన్, బెస్తపల్లె గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని, అందరూ నీటి తొట్టెలు నిర్మించుకోవాలని కోరారు. జిల్లాకు 1115 నీటి తొట్టెలు మంజూరు చేశామని, పది రోజుల్లో పూర్తిచేయాలని డ్వామా పీడీ వెంకటరత్నంకు ఆయనసూచించారు. వాటి నిర్మాణంతో పాడి పశువులు, గొర్రెలు, మేకలకు ఎంతో మేలు జరుగుందన్నారు. అనంతరం నారాయణరెడ్డిపల్లె, కొండవాండ్లపల్లెల్లో నీటితొట్టెల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం చిన్నమండెం టౌన్‌లో రూ.15 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, బెస్తపల్లె గ్రామంలో నూతన బోరును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నారాయణరెడ్డిపల్లెలో నీటితొట్టి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

కుమార్తెను ఇంటికి పంపమన్నందుకు మామపై అల్లుడు దాడి

రాయచోటి టౌన్ : తన కుమార్తెను రంజాన్ పండగకు పుట్టింటికి పంపమన్నందుకు మామపై అల్లుడు దాడి చేసిన సంఘటన రాయచోటిలో శనివారం చోటుచేసుకొంది. బాధితుల కథనం మేరకు.. రాయచోటి పట్టణంలోని పాత రాయచోటికి చెందిన అజ్మత్ తన కుమార్తె తంజీమ్‌ను అదే ప్రాంతానికి చెందిన మహబూబ్‌బాషా కుమారుడు జుబేర్‌కు ఇచ్చి ఏడాది కిందట వివాహం చేశారు. పెళ్లిరోజున ఇచ్చిన బంగారు ఆభరణాలు అమ్మే కాదని ఇటీవల భార్య, భర్తల మధ్య గొడవలు మొదలయ్యాయి. ఇంతలో రంజాన్ పండగ రావడంతో అల్లుడు, కుమార్తె, బంధువులను పండగకు పిలిచేందుకు తన కుమార్తె ఇంటికి అజ్మత్ వెళ్లారు. వారు పంపేందుకు నిరాకరించడమేగాక అజ్మత్‌తో ఘర్షణ పడ్డారు. వాగ్వాదం పెరిగి అల్లుడి బంధువులు అజ్మత్‌పై దాడి చేసి గాయపరిచారు. పోలీసులకు ఫిర్యాదు చేశామని బాధితులు తెలిపారు.

రాయచోటిలో.. గ్యాంగ్ వార్

- కత్తులు, రాడ్లతో ఇరువర్గాల దాడులు
- ఆరుగురికి గాయాలు, ఒకరి పరిస్థితి విషమం
- ఆస్పత్రిలోనూ రాళ్ల దాడులు

రాయచోటి: రాయచోటిలో గ్యాంగ్ వార్ తారస్థాయికి చేరింది. ప్రతి రోజూ రాత్రి వేళల్లో పూటుగా గంజాయి తీసుకున్న యువకులు కత్తులు, రాడ్లతో దాడులకు తెగబడుతున్నారు. సోమవారం రాత్రి స్థానిక సంజీవనగర్ కాలనీ సమీపంలోని శివాలయం వద్ద గ్యాంగ్ వార్‌ను తలపించేలా కొత్తపల్లి, రెడ్డీస్ కాలనీలోనే లాల్ మసీద్ ఏరియాలలోని ఇరువర్గాల వారు పరస్పరం దాడులకు దిగారు. కత్తులు రాడ్లు, బండరాళ్లతో ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో ఒక్కసారిగా ఆ ప్రాంతమంతా యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ దాడిలో లాల్ మసీద్ ఏరియా గ్యాంగ్‌కు చెందిన ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఇశ్రాన్(27), రియాన్(21) పరిస్థితి విషమంగా మారింది. ఇరువురినీ మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అహమ్మద్ (25), షేక్ హాసిఫ్(22), అఫ్జల్(23)లకు రక్తగాయాలయ్యాయి.

ఆస్పత్రిలోనూ బండరాళ్లతో దాడులు

గాయాలపాలైె ఆసుపత్రికి చేరిన క్షతగాత్రులను పరామర్శించడానికి వచ్చిన వాళ్ల మిత్రులు, ప్రత్యర్థి గ్యాంగ్ మధ్య తిరిగి ఆసుపత్రి ఆవరణలోనే ఘర్షణ చోటు చేసుకుంది. ఇరు వర్గాల వారు బండ రాళ్లతో దాడులకు తెగబడ్డారు. ఈ దాడిలో షేక్ ఆసిఫ్ తలకు బలమైన గాయమైంది. విసిరిన బండరాళ్లు ఆస్పత్రి లోపల పడ్డాయి. రోగులు, ఆసుపత్రి సిబ్బంది పరుగులు తీశారు. సీఐ వెంకటాచలపతి, సిబ్బంది రావడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.



ఆసుపత్రి బెడ్ పైన రియాన్



గాయాలతో ఇశ్రాన్

పేరుకే వంద పడకల ఆసుపత్రి

తీవ్ర గాయాలపాలైె ఆసుపత్రికి చేరిన వారికి చికిత్స అందించే వైద్యులు కరవయ్యారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో వంద పడకల ఆసుపత్రిని నిర్మించిన అవసరానికి వైద్యులు మాత్రం అందుబాటులో ఉండడం లేదనే విమర్శలున్నాయి. సోమవారం రాత్రి 9:30 గంటలకు గాయాలతో చేరిన వారికి ఇద్దరు నర్సులు మాత్రమే చేతనైన చికిత్స అందించారు. గాయాలతో బాధపడుతున్న వారి రోదనలు మిన్నంటుతున్నా.. సరైన వైద్యం అందించలేని పరిస్థితి. డ్యూటీలో ఉన్న వైద్యులు సుమారు 50 నిమిషాల వరకూ కనిపించలేదు. ఆ తర్వాత మిగిలిన నర్సులు, సిబ్బంది ఆసుపత్రికి వచ్చారు. పేరుకు మాత్రం వంద పడకల ఆసుపత్రి ఉన్నా అత్యవసర పరిస్థితుల్లో చికిత్స చేయడం, విధులలో ఉండకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.



ఆసుపత్రి లోపల బండరాయి

ఆకతాయి ఆగడాలకు.. వృద్ధులకు గాయాలు

ఓబులవారిపల్లె : మద్యం తాగి ఆకతాయిలు రాళ్ల విసరడంతో తేనెటీగలు లేచి ఆశ్రమంలో వృద్ధులపై దాడి చేశాయి. మండలంలోని పాపిరెడ్డిపల్లి గ్రామంలో జీవన జ్యోతి ఆనంద నిలయంలో ఆశ్రయం పొందుతున్న ఏడుగురు వృద్ధులకు స్వల్ప గాయాలయ్యాయి. ఆశ్రమం ప్రక్కనే చెట్టుపై తేనెపట్టు ఉండడం.. ఆకతాయిలు మద్యం తాగి రాళ్లతో కొట్టడంతో అవి వృద్ధులపై దాడి చేయడంతో దిక్కుతోచక వారంతా ఆందోళనకు గురయ్యారు. గాయపడిన వారిని 108 వాహనంలో ముక్కవారిపల్లి ఆసుపత్రికి తరలించారు. వైద్యాధికారి వృద్ధులకు చికిత్స చేశారు. రాళ్లతో దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆశ్రమం నిర్వాహకుడు పొణ్యం సుబ్రహ్మణ్యం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



తేనెటీగల దాడిలో గాయాలైనవారికి చికిత్స అందిస్తున్న వైద్యులు

అనాథ వృద్ధుడి మృతదేహానికి అంత్యక్రియలు

సిద్దవటం : మండలంలోని కనుమలోపల్లె రైల్వే స్టేషన్ వద్ద మృతి చెందిన 60 ఏళ్ల వృద్ధుడి మృతదేహానికి కాశీవిశ్వనాథ సేవాసమితి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. వృద్ధుడు చనిపోయినా బంధువులు ఎవరూ రాకపోవడంతో పోలీసులు స్వచ్ఛంద సంస్థకు అప్పగించారు. హిందూ సంప్రదాయం ప్రకారం సంస్థ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుండ్లకొండ రవి, నాగుల రాంప్రసాద్, రెడ్డిలక్ష్మణ్‌దామోదర్, మధు, సురేష్, ఏఎస్ఐ సుబ్బరామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.



అంత్యక్రియలకు మృతదేహాన్ని తీసుకెళ్తున్న సభ్యులు